1

ఏకలవ్యుడు

“పది” అంది వకీలుగారింటి గడియారం.

“కాదుస్మీ” అంది పక్క వాటాలో మేష్టరుగారి గడియారం.

* * *

ఆ రాత్రి పదిగంటల వేళ ఈ విధంగా, పదీ అయిందని రైల్వే గడియారాలూ, కాలేదని రేడియో గడియారాలూ అభిప్రాయపడుతున్నాయి. పురోగమనం అంటే మరీఇదయ్యే చిల్లర గడియారాలు గంటక్రితమే పదికొట్టేసి, పన్నెండవడానికి సిద్ధంగా ఉన్నాయి.

షికారు కెళ్తానని చెప్పి రెండో ఆట సినిమా చూసి వచ్చిన పురుష పుంగవులు, కలత నిదురలో లేచి తలుపు తెరచిన నెలతల నునులేతబుగ్గల పౌడరు పొరమీద తేలిగ్గా చిటికవేసి, ‘ఏడున్నరకే పడుకున్నావేం, తలనొప్పిగా ఉందా’ అని కుశలం అడుగుతూ బుకాయించి తమకు ఆకలిలేనివైనాన్ని వెల్లడించి, పునరుద్ఘాటించి హడావుడిగా నిద్ర నటిస్తున్నారు.

గోదావరీతీరాన సీరియల్ విరహగీతాలాపన సహాబాధ పడి పడి, మిగతాది భోంచేశాక అని స్తిమితపడి, ఆ

వేళకే ఇల్లుచేరిన రోమియోలు పొంగిపొరలే వేదననీ, అమ్మ పెట్టే చివాట్లనీ, ఎదురుగుండా కంచంలో ఉన్న పొడిమెతుకుల్నీ కలిపి దిగమింగుతున్నారు.

*　　　*　　　*

'పది' అంది వకీలు సుబ్బారావుగారి గడియారం.

"సరిగ్గా ఈపాటికి సీత హైదరాబాద్‌లో పడుకో బోతూ ఉంటుంది" అనుకున్నాడు—సీత దైనందినీయం కంఠతా పట్టిన గురునాథరావు.

"ఇందాక కాదు. ఇప్పుడే పది అయింది" అంది గురునాథరావు పడుకున్న గదిలో గడియారం, చేతనైనంత గంభీరంగా. 'హు' అనుకున్నాడు గురునాథరావు గట్టిగా.

పక్క వాటాలో ప్లీడరు సుబ్బారావుగారికీ ఇక్కడ గురునాథం తండ్రి రామనాథంగారికీ అభిప్రాయ భేదాలున్నాయి. కాబట్టి, స్వామిభక్తిగల వారి వారి గడియారాలూ, రోజూ రాత్రి పదిగంటలవేళ లాంఛనానికి విభిన్నాభిప్రాయాలు ప్రకటిస్తాయి.

ఇలా విభిన్నాభిప్రాయాలు గలవారు ఇరుగూ పొరుగులుగా ఉంటూ శాంతియుతంగా సహజీవనం చేయ వచ్చునని, ఆమాట కొస్తే, చేసితీరాలని నమ్మినవాడు గురునాథరావు. అందులోనూ, ప్రక్కవాటా వకీలుగారి కూతురు ఇవతలి వాటాలో పెళ్ళికాని పిల్లాడి హృదయాన్ని అపహరించి అట్టేపెట్టుకున్నప్పుడు మార్గాంతరం లేదు.

అయితే, ఈ సహజీవనం ఏర్పాటుమీద గురునాథరావుకి ఎంత గురివున్నా ఆ క్షణాన, ఇరుగుపొరుగు గడియా

రాలు రెండూ చెరో అభిప్రాయం ప్రకటించడంతో కొంత ఒళ్ళు మండిపోయింది.

ఏ క్షణాన సీత హైదరాబాద్‌లో పడుకొని ఉంటుందీ అన్న విషయం సందిగ్ధంగా ఉండిపోయింది. ఇంకో క్షణానికి, అది అతనిపాలిట జీవత్ మరణ సమస్య అయిపోయింది.

కాలేజీలో ఓ ప్రేయసి, గుడిప్రక్క మేడమీద ఓ జూలియట్, గోదావరోడ్డుకి షికారు కెళ్ళే దారిలో ఓ సుందరి ఇలా ప్రేయసీమణుల జాబితా వేసుకుని, ఎవరేనా ఊరు వెళ్లితే తాత్కాలికంగా ఆ ఖాళీ భర్తీచేయడానికి విడిగా "స్టాండ్ బై" (ప్రత్యామ్నాయ ప్రేయసీమణులు) ల జాబితా, హమేషా సిద్ధంగా ఉంచుకొని ప్రొబేషనరీ జూలియట్‌లిస్టు వేరే తయారుచేసుకున్న వాళ్లకి ఈ "ఏకలవ్యు"డి కష్టాలు బోధపడవు.

అవకాశవాది అభిప్రాయాలలా, క్షణానికో ప్రేయసిని మార్చుకునే వీళ్ళకి ఈ సమస్య, బొత్తిగా అమావాస్యలా రూపరేఖారహితంగానూ, పిరికివాడి అభిప్రాయంలా అయోమయంగానూ, ఎన్నికల వాగ్దానంలా అసంగతంగానూ కనబడుతుంది.

హైదరాబాద్‌లో ఒక సీత ఎన్ని గంటలకి నిద్రపోతే ఏమొచ్చె అని హేళనచేసి తేలిగ్గా కొట్టిపారేస్తారు.

కాని గురునాథరావు నికార్సైన "ఏకలవ్యుడు." సీతని చూశాడు, ప్రేమించాడు. ఇంకెవరినీ చూడలేదు. చూచినా ప్రేమించలేదు.

'సీతే నా జీవితం' అనుకున్నాడు.

'సీతే నా జీవితగీతి' అని తరువాత ఓ ప్రేమ గీతం వ్రాశాడు. బాగుండలేదండి సీత. సరేనని చింపేశాడు గురునాథం.

ఆ తరువాత ఎన్నాళ్ళయినా అతడు సీతనే ప్రేమించ సాగాడు (పాటలు వ్రాయకుండా). కాలేజీలో చాలమంది అతన్ని లోకువకట్టి, 'ఏకలవ్యుడు' (ఒకే ప్రేయసిగలవాడు) అని పేరు పెట్టారు.

అయినా గురునాథరావు ఈ వ్రతం ఉల్లంఘునకి వడి కట్టలేదు. అందులో కొన్నాళ్ళాయి, సీత, పక్కవాటా అమ్మాయి అయింది.

సీత కాఫీతాగడం ఆలస్యం అయితే, ఆ సంగతి తెలి యకపోయినా, ఇవతలి వాటాలో గురునాథరావుకి రకీమని తలనొప్పి వచ్చేది. అతనికి తలనొప్పి వచ్చిన తక్షణం సీత కాఫీతాగేసేది, తెలియకుండానే.

అందువల్ల, సీత హైదరాబాద్‌లో ఆ రాత్రి ఏ పది గంటలకి పడుకుని ఉంటుందన్న విషయం తెగని సమస్య అయిపోయింది. ఇండియన్ స్టాండర్డ్ టైము తెలిస్తే బాగుండు ననిపించింది.

అందువల్ల ఆ రాత్రి పదిన్నర ప్రాంతాల్లో ఎవరో హఠాత్తుగా దబదబ తలుపుకొట్టడంతో "ఇండియన్ స్టాండర్డ్ టైం ఎంతో నాకు తెలియచెప్పడానికి సీత పంపిన దూత కాబోలు" అన్న అభిప్రాయంతో గురునాథరావు చెంగున గంతువేసి పరుగెత్తి తలుపుతీసి, "ఎంత?" అన్నాడు అర్జెం

టుగా. తలుపవతల నిలబడిన నల్లటి, సన్నపాటి చిన్న సైజు శాస్త్రీ బోల్డుసిగ్గు పడిపోయి, తలక్రిందులైపోయి, సంతోషం ఆశ్చర్యం నటించి "మూడున్నరచాలు ఇప్ప టికి" అంది టూకీగా.

మూడున్న రేమిటని గురునాథరావు తుళ్ళిపడికళ్ళు విప్పార్చి చూశాడు. "టీ, సిగరెట్లూ కూడా లేకుండా, లేవన్నసంగతి తెలియకుండా ఇలా రాత్రి మూడున్నరదాకా సీతగురించి బెంగెట్టుకుంటున్నాను కాబోలు" అనుకుంటూ.

ఐతే ఉత్తరక్షణంలో, ఎదుటకనబడ్డశాస్త్రీకీ, సీత పంపలేను దేవదూతకీ పోలికలేం కనబడలేదు గురునాథానికి.

"హరి నువ్వట్రా" అన్నాడు.

"కాదుమరీ, పూర్తిగా నేనే, కేవలం నేనే." అన్నాడు తుకారాం వినమ్రభావంతో, మందంగా హసిస్తూ.

గురునాథం గబుక్కున తలుపు గడియ వేసేయ బోయాడు.

కాని దూరదృష్టిగల తుకారాం అప్పటికే తలు పివతల ఓ కాలు పెట్టేశాడు.

"మూడున్నర కాకపోతే రెండున్నర చాలులే" అన్నాడు.

"అణాన్నర కూడా ఇవ్వను" అన్నాడు గురునాథం.

"నువ్వేగా, ఎంతకావాలని మహా భోజరాజు పోజుల్లో అడిగావు! పోనీ అణాయేనా ఇయ్యి, టీ తాగిపోతాను."

అన్నాడు తుకారాం. గురునాథం జేబులో సిగరెట్లు తీసుకుంటూ.

"దమ్మిడీకూడా ఇవ్వను...నే నడిగింది షై మెంత అని."

"బ్రదర్! నీ ఎడంగుండెలో హార్టేమయింది?... ఇంత కర్కశంగా మాట్లాడుతున్నావే! నీ హృదయం ఏమయి పోయిందీ అంట" అన్నాడు తుకారాం విస్తుపోయి.

"నా హార్టిక్కడ లేదోయ్. హైదాబాద్ వెళ్లింది" అన్నాడు గురునాథం చిరాగ్గా.

"ఓస్ ఇంతేకదా! మళ్ళా ఎల్లుండి సోమవారం పొద్దున్నే ఇక్కడ సిద్ధం అవుతుందిగా. అపుడు నచ్చ చెబుదు గానిలే. ఇప్పుడు ఆడిన మాట తప్పకు...నా సత్యవంతు డివిగాదూ...నా హరిశ్చంద్రుడివిగాదూ."

"అట్టె అటె. సీత పదిరోజులదాకా రానందిగదా. ఎల్లుండే వస్తుందని ఎవరు చెప్పారు?"

"తుకారాం న్యూస్ సర్వీస్ వారు సరియైన సమా చారాన్ని సరసమైన ధరలకే విక్రయించెదరు" అన్నాడు తుకారాం.

"అక్షరలక్షలిచ్చేస్తాను. త్వరగా చెప్పు బాబూ."

"అబ్బే, మాట కణా, లేక ఆరుపైసాలు ఇస్తేచాలు. వెళ్ళి దోసెడణాకాసులు పట్రా. ఒక్కోటీ వేద్దుగాని" అన్నాడు తుకారాం.

* * *

పై విధంగా పావ ల్తక్కువ మూడు రూపాయలు పెట్టి గురునాథరావు కొనుక్కున్న సమాచారం సారాంశం, మూడో నాటికల్లా సీత హైదరాబాద్ నుండి తిరిగి రాబోతున్నదని.

"ఏం, ఢిల్లీ వెళ్ళదా మరి? కొంపదీసి—" అన్నాడు గురునాథరావు.

"రైట్. సరి. కరెక్టండి. అక్షరాలా నిజమండి. మీ కాబోయిన మామగారు అవాలనుకొన్న మినిష్టరు అవటం లేదండి..."

గురునాథరావు ఉలిక్కిపడ్డాడు. "నీ వెనకాల చీకటి నిండా వేలాది శ్రోతలు క్యూలో నిల్చున్నా రేవిట్రా? ఎవడు వాడు?" అన్నాడు కంగారుగా.

"ష్! అప్పుడే కాదు. ఆగండి" అన్నాడు తుకారాం. చీకట్లోకి అభినయిస్తూ. ఆ అశరీరవాణి ఆగింది.

"మాటాడవేంరా" అన్నాడు గురునాథం ఉరుముతూ.

"...అదేనండి. మీరనుకున్నట్టే...మీ మామగారికి మినిష్టరు ఛాన్సు రాదుటండీ...అందుకేమో, ఢిల్లీ ఇంకెందు కని..."

"ఛఛ్, నోర్ముయ్యండి. మిమ్మల్ని కాదు, నన్నా వాడు అడిగింది" అన్నాడు తుకారాం గట్టిగా. అశరీరవాణి మళ్లీ ఆగిపోయింది.

"ఎవరువారు?" అన్నాడు గురునాథరావు.

"వారిపేరు టిలిపతిరావుగారులే. పొలిటికల్ ఎక్స్‌పర్ట్. తుకారాం న్యూస్ ఏజన్సీ డైరెక్టరు...జౌనుగాని నేను అర్జంటుగా ఓపనిమీద వచ్చాను. విను."

"నా దగ్గిర ఇంక డబ్బులేదు. ఉన్నా ఇవ్వను."

"పోనీ. వద్దులే. నే వెళ్లేలోగా నీ మనసు కరిగి నీరైపోకపోతే ఇవ్వద్దులే. అవునుగాని, నాక్కొంచెం షోగ్గా సంతకం పెట్టడం నేర్పగలవూ" అన్నాడు తుకారాం.

"ఏం గిరాకీ, చెక్కు-బుక్కు- దొరికిందా?"

"ఇంకా లేదు. రేపణ్ణించి దారుణంగా డబ్బొచ్చేస్తోంది. న్యూస్సర్వీస్ పెట్టాంగదా మరి...దానికోసం అని చెక్కులమీద సంతకం నేర్చుకోవద్దూ. అది మంచి దర్జాగా, ఎవరికీ అర్థం కాకుండా, నేను మళ్ళీ ఎప్పుడూ ఒకలాగే పెట్టడానికి వీలుగా ఉండాలి."

"అబ్బ, ఊహూ బాపుల్దికాని, ళిద్దరొస్తాల్ది, పోయి పడుకుల్టారా, నీ సల్తకాల బాట దేవుళెరుగు" అన్నాడు గురునాథరావు బద్ధకంగా ఆవలిస్తూ.

"పదమూడు" అంది తలుపవతలి అశరీరవాణి.

"అబ్బబ్బ! అవి పేగులుకావు సార్" అన్నాడు తుకారాం విసుగ్గా...

"ఎవర్రాలది. ఏమిటాల్రి కథ...ఇట్రమ్మను."

తుకారాం కొంచెం సిగ్గునటించి, చీకట్లో శాల్తీని వెలుగులోనికి లాగాడు.

"వీరిపేరు కులపతిరావుగారు. ఆవలిస్తే పేగుల్లెక్కెడతారు."

"ఎందుకూ? జబ్బా? హాబీవా?" అన్నాడు గురునాథరావు.

"కాదు వృత్తి. పొలిటికల్ ఎక్స్‌పర్ట్ దగ్గిర ఉండాల్సినవిద్య అదేగదా."

"ఆ, ఐతే ఇప్పుడు నాకు పదమూడు పేగులున్నాయంటారా సార్" అన్నాడు గురునాథం సగౌరవంగా.

"ఆయనబొంద! ఆయన అభిప్రాయాల కేంలే. అసలాయనికి తెలీదు. ఆవలిస్తే పేగుల్లెక్కెట్టొచ్చునని. ఎవరో చెప్పార్ట. ఈయనేమో రొమ్మెముకలు చూసి పేగులనుకుంటాడు. ఒరేయ్... మెడమీద మిడత పడ్డట్టు అలా చూడకు. నేనేదో తన్నితిడుతున్నాననుకుంటాడు. చెవుడులే..." అన్నాడు తుకారాం సాదాగా.

కులపతిరావుగారు ఎలక్షన్స్‌లో గెలిచిన వాడిలా వినమ్రభావంతో మందహాసంచేసి గురునాథరావుకి నమస్కరించాడు. "నామీద అభిమానంకొద్దీ వారలా నన్ను ఘనంగా ఎన్నిక చేస్తున్నారు. నమ్మకండి. తుకారాం సర్వీసు అయిడియా ఆయనదే; కంపెనీ నాదిలెండి. హిహీ" అన్నాడు...

గురునాథరావు వీధిలోకి దృష్టిసారించి ఎవరండీ అన్నాడు హఠాత్తుగా. తుకారాం వెనక్కితిరిగాడు కుతూహలంకొద్దీ.

రాజకీయ హంతకుడు సాటినాయకుడిని కూల్చద్రోసే ఒడుపుతో, సుతారంగా, సున్నితంగా, మృదువుగా, గురునాథరావు తుకారాంని గుమ్మం అవతలకి నెట్టేసి గబుక్కున తలుపువేసి గడియపెట్టి ఆవలించి 'హారా' అనుకుని, మంచం మీద పడుకుని సీతగురించి బెంగెట్టుకొంటూ నిద్రబోయాడు.

గడియారం మళ్లీ గంటలుకొడుతూ ఉండగా, వీథి తలుపు చప్పుడైంది.

గురునాథరావుకి మెలకువ వచ్చింది కాని, తలుపు కొట్టేది తుకారాముడే నన్న నమ్మకంతో కళ్లుమూసుకు పడుకున్నాడు.

అందుకని వాళ్ళ నాన్నగారు లేచివెళ్ళి తలుపు తీస్తూనే, "అరె! మీరా? ఎప్పుడూ రావడం?" అన్నారు.

"డిసెంబరు ఇరవయ్యో తారీఖు పొద్దున్న. నాలుగు నెల్లాయి గుమ్మంలో నించుని తలుపు కొడుతున్నాం" అన్నారు సుబ్బారావుగారు గంభీరంగా.

"ఓరి బాబో! మినిష్టరై పోయినట్టే మాటాడు తున్నారే, బావగారు!" అన్నారు రామనాథంగారు.

"ఏమిటి కథ? ఠకీమని జవాబిచ్చేశారే! ఇంక్రి మెంటుగినా తగిలిందా కొంపదీసి?" అని ఆశ్చర్యాన్ని అభినయించారు సుబ్బారావుగారు.

"ఇంకా అలాంటి ఉత్పాతం ఏదీ సంభవించలేదు గాని, మీరు పెద్దసైజు లీడరు అయే లోగానే మా టీచర్లకి

జీతాలు పెరగడం మటుకు ఖాయం లెండి...కావలిస్తే రాసిస్తా'' అన్నారు రామనాథంగారు ఫెళఫెళ నవ్వుతూ.

“అలా జరిగితే నేను మంత్రి అయిన తక్షణం అవన్నీ రద్దు చేయించేస్తాను. ఆ యింక్రిమెంట్లేవో నాచేతిమీదగానే రావాలి.”

“మరే. ‘లేదు పొమ్మనడానికి కోడ లెవర్తి’ అందిట వెనకటికో అత్తగారు.”

దానికి తకీమని జవా బేంచెప్పాలో లాయరు గారికి తట్టలేదు.

రాగాలాపనలో పైషడ్జమం దాటిపోయి అక్కడేం చెయ్యాలో తోచక, దిగలేక నిలవలేక అవస్థపడే జూనియర్ గాయకుడిలా గింజుకోసాగాడు.

అంతవరకూ, మాటాడకుండా, అలా మరచెంబూ సంచీ పట్టుకొని నిలబడ్డ సీత తక్షణమే “నాన్నా, నిదరొస్తోంది, ఇంటో కెడదామా ఇంక” అంది.

“అయ్యో రాతా! నీ సంగతే మర్చిపోయాను! నా కబుర్లా నేనూను! పదమ్మ పద, తాళం తియ్యి” అన్నాడు లాయరుగారు మహా సంతోషపడి పోయి మళ్ళీ లేచి.

కష్టపరిస్థితులు వచ్చినపుడల్లా సీత ఆయన్ని ఇలాగే ఆదుకుంటుంది.

ఆయనకి కేసులు గెలవడం బోలెడు సరదా. కాని, గెలవడానికని కోర్టుకెళ్ళినా కేసులుదొరకవు. ఇంకెందుకని వెళ్ళడమూ

మానేశాడు. అందుకని ఇంట్లోనే కూతురితోనూ, ఇరుగు పొరుగులతోనూ సూటిపోటి మాటల పోరాటాలు పెట్టుకుని, ఎదుటిమనిషి నోరుమూయించినపుడల్లా 'కేసుపోయింది' అని నవ్వేసి మురిసిపోయే అల్పసంతోషి. ఈ తరహా కేసులు ఆయన తరచు గెలుస్తూనే ఉంటాడు. ఓడేది సాధారణంగా పక్కవాటాలో మేష్టరిగారి దగ్గరే. అసలు, మేష్టరు ఈదురో మంటూ, దిగులుగా, ఎప్పుడు బతికావు అంటే ఏణ్ణర్థం అయిందన్నట్లుగా ఉండాలని ఆయన భావం. కథలు చదివి చదివి, ఆయన మనసులో ఖరారు చేసుకొన్నాడు. రామనాథంగారు టెంగు రంగామంటూ ఉండడం, మాటకు మాట బదులు చెప్పగలగడం ఎలా సాధ్యమో ఆయనకి బోధపడలేదు.

అసలు లాయరు సుబ్బారావుగారు ఆ యింటో అద్దెకు దిగిన కొద్దిరోజులకే, చనువుపేరిట అలుసు తీసుకుని, ఓరోజు పొద్దుటే "హా టీచర్స్! పూర్ క్రీచర్స్" అనేశారు. ఆ తరువాత "మీ జీతాలు దారుణం. ఎలా బతుకుతున్నారో గాని" అన్నాడు.

"అదేనండి పెద్దమిష్టరీ...అయితే ఒక్కవిషయం గమనించారూ. మా జాతికి ఈ నెల కాపోతే పై నెలైనా వంద కాబోతే యాభయేనా చేతికందడం గారంటీ అండీ" అన్నాడు. మేష్టరు రామనాథంగారు నవ్వుతూ.

దానికి రకీమని కాదుగదా, ఇంకో నిమిషం తిరిగినా కూడా సుబ్బారావుగారికి జవాబు తోచలేదు.

'కేసు పోయింది.' అని రామనాథంగారు అనబోతూ ఉండగా, "నాన్నోయ్, కాఫీ" అని కేకపెట్టింది సీత వంటింట్లోంచి.

ఒక్క అంగలో వంటింట్లో పడ్డాడు సుబ్బారావుగారు 'హమ్మయ్య!' అనుకొని.

"అబ్బ! ఎంత వేడి...నాన్నా, నీ కిపుడు మేష్టారంటే బాగా ఒళ్లు మంటుతూందికదూ" అంది సీత నవ్వుతూ.

"ఔనమ్మా, మరీ పొగరుగా మాటాడతాడు. అసలు మందే తప్పా, ఈ మధ్యతరగతివాళ్లకి చనువిస్తే నెత్తి కక్కిపోతారు." అన్నాడు. అంటూనే ఆయనకి బ్రహ్మాండమైన ఊహపోయింది. కూతురి మాటలు సాంతం వినకుండానే, మళ్ళీ ఉమ్మడి సావిట్లోకి వెళ్ళాడు.

"అప్పుడే కాఫీ తాగేశారండీ!" అన్నారు రామనాథం గారు. ఆయన కొత్తలో కొన్నాళ్లు లాయరుగారి దొంగ దెబ్బలు తెలిసినా సహిస్తూ వచ్చాడుగాని ఆయన తనని వాజమ్మకింద జమకడుతూన్నట్లు పసిగట్టి, పొట్టేలులా పుంజు కొన్నాడు.

"ఏమి కాఫీలోనండీ! దండుగ ఖర్చు! సామెత చెప్పి నట్లు, మనందరికీ తాహతు మించిన గుణాలు అబ్బాయి," అన్నాడు సుబ్బారావుగారు.

"కాఫీకే అలాఅంటే ఎలాగండీ? ఆ మాత్రం తాహతూ లేదనుకుంటే ఈ తాపత్రయాలెందుకట?"

"దొరికింది ఛాన్సు" అనుకున్నాడు సుబ్బారావుగారు. అనుకుని దాడికి ఉపక్రమించాడు.

"ఏమిటండీ సార్. మన తాహతు. ఏమిటంట. అసలు మన తలిదండ్రులకే పొరబాటువకాస్త దూరదృష్టి ఉండబట్టి ఏదో నాలుగక్షరమ్ముక్కలు నేర్పించారు. సరి పోయింది. ఇవాళ కాఫీలు తాగుతున్నాం. లేకపోతే ఈ నాడు మనం జెటకాబండి తోలుకు బతకాల్సినవాళ్ల మేగా... అహా! సంగతి చెబుతున్నా. ఔనంటారా కాదంటారా" అన్నారు సుబ్బారావుగారు ధాటీగా. దెబ్బకి చచ్చాడు అనుకున్నా డాయన కుర్రాడి ఆనందంతో.

"ఖచ్చితంగా కాదంటానండి. మీ వాళ్ళ సంగతేమో నాకు తెలీదుగాని, మా పెద్దలికి దూరదృష్టి లేక పోవడం ఎన్నడూ జరగదు. ఒకవేళ వాళ్ళకి ఆ దృష్టిలేక, నే నివాళ జెటకా తోలుకోవలసి వచ్చినా అందుకేం దిగులు పడను. ఝూంమని జెటకా తోలుకు బతుకుతాను. ఔనంటారా కాదంటారా" అన్నారు రామనాథంగారు.

"నాన్నోయ్! కాఫీ చల్లారి పోతుంది. తొరగా రా" అంది తలుపవతలే ఉన్న సీత.

"వచ్చేనమ్మా వచ్చే" అని పరుగెత్తి కెళ్ళిపోయాడు జవాబు తోచని సుబ్బారావుగారు.

* * *

"నువ్వు గొప్ప రాజకీయ నాయకుడివీ; పెద్ద మినిష్టరువీ అవబోతున్నావు" అని మర్నాడు ఓ జ్యోతిష్కుడు

(ముందుగా తెచ్చి ఉంచుకున్న) ఢంకామీద దెబ్బకొట్టి చెప్పేవరకు ఆయన కోలుకోలేదు. ఆ తరవాత దినపత్రిక కొని చదివేసేవరకూ ఊరుకోలేదు. చదివేశాక అంతకన్న ఊరుకోలేదు. రామనాథంగారిని ఊదరగొట్టేశాడు.

"పేపరు చదవడం చాలా అవసరమండీ" అన్నాడు, ఆయన్ని మరమ్మత్తు చేసే సత్సంకల్పంతో.

"మీ రీ యింట దిగినప్పటినించి ఆ ముక్క నేను చెబుతూ వచ్చాను గదా! ఇన్నాళ్ళకి గుర్తించారన్నమాట" అన్నారు రామనాథంగారు నవ్వుతూ.

సుబ్బారావుగారు బిక్కమొహం పెట్టబోతూ ఉండగా "నాన్నా, ఒక్కసారిలా రా" అని గావుకేక పెట్టింది సీత.

"నా తల్లే, మా ఇందిరే" అని మురిసిపోతూ పారిపోయారు సుబ్బారావుగారు.

"ఏమండోయ్ బావగారూ, కేసు పోయిందనను లెండి గాని, ఇందిరెవరూ? మీ పిల్లపేరు సీతగాదూ" అన్నారు రామనాథంగారు.

సుబ్బారావుగారు జవహర్‌లాల్ నెహ్రూ అంత ఎత్తు సాగి, అక్కణ్ణించి రామనాథంగారిని "క్రేన్ షాట్ వ్యూ" లో చూసి, మందహాసం చేసి, మాట్లాడకుండా వెళ్ళిపోయారు; తరువాయికథ తెరమీద చూడండన్న తరహాలో.

నిజాని కాయన అంతవాడూ కావడం ఖరారని ఢంకా పట్టుకొచ్చిన జ్యోతిష్కుడు దానిమీద అదేపనిగా బాదుతూ చెప్పాడు.

పోలికలు కూడా బోలెడున్నాయన్నాడు. జవహర్‌లాల్‌కి తోడునీడ కుమార్తె ఇందిర ఒకర్తే. సుబ్బారావుగారికి ? సీత ... కేవలం అదొక్కటే కారణంగా, ఈయన అమాంతం రేప్రొద్దునే ప్రైమినిష్టరు అయిపోక పోయినప్పటికీ ముందస్తుగా చిన్న మినిష్టరు— రాష్ట్రంలో-అవుతాడుట. అలా అవాలని ఆయన చెప్పాడు.

“ఎక్కడో అక్కడ ఎలాగో అలా ఓసారి మినిష్టరు అయి ఊరుకోండి. ఇంక ఫరవాలేదు. వన్స్ ఎ మినిష్టర్ —” అని జ్యోతిష్కుడు అనే సరికి.

“ఆల్వేజ్ ఎ మినిష్టర్” అని సుబ్బారావుగారు అందుకున్నారు తకీమని.

సుశిక్షితుడైన జ్యోతిష్కుడి శిష్యుడు, సకాలంలో తుమ్మాడు.

సుబ్బారావుగారే తక్షణం జయం అన్నారు.

“మీరు ఇవాల్టినుంచీ పేపరుకి చందాకట్టేసి రాజకీయాల గుట్టూ మట్టూ ఆకట్టుకోండి. ఈలోగా, అంతర్జాతీయ సమస్యలు—ప్రపంచశాంతి లాంటివి— తేలికైనవి నాలుగైదు ఏరుకొని వాటి పరిష్కారానికి ప్లానులు ఆలోచించండి” అని నూరిపోసి, నూరు తీసుకు చక్కాపోయాడు జ్యోతిష్కుడు.

సుబ్బారావుగారు సమస్యల జాబితా ఓటి తయారు చేసి అట్టేపెట్టుకొని ఓరోజు పొద్దుటే హైదరాబాద్ బయల్దేరారు.

"అన్నట్లు మేష్టారూ, మీ జీతాలు పెంచేసమస్య ఓ టుందిగదూ! అక్కడి కెళ్తూనే చూస్తాలెండి" అన్నారు ఉద్ధరించే ఏర్పాటులో దర్జాగా.

"చిత్తం. మా సమస్య హైదరాబాదులో లేదండి. ఇందంబటే, మేష్టర్ల ఇళ్ళలో ఉంటోంది. ఏదో తీర్మానం గట్రా చేస్తున్నాం లెండి" అన్నారు రామనాథంగారు నవ్వుతూ.

"అమ్మమ్మమ్మ! అలాంటి పిచ్చిపను లేం తొందరపడి చెయ్యకండి. వాళ్లు పుసుక్కుని లేదనేస్తారు. ఏదో నాలాంటి వాడెళ్లి నిలదీసి గట్టిగా కనుక్కోవాలిగాని...కనుక్కోవడం ఏముంది, మినిష్టరంటూ అవుతూనే—"

"ఎంతమాట! ఎంతమంది మినిష్టర్లు కాందే మా కష్టాలు గట్టెక్కేను. మా సంఘంలో చెబుతాలెండి. 'సుబ్బారావుగారు మంత్రిఅయేదాకా మాజీతాలు పెంచొద్దు, వీలైతే తగ్గించండి' అన్న తీర్మానం చేస్తాం. మీ ముద్దు చెల్లుగాత. శుభం. వెళ్ళిరండి."

"మళ్ళీ ఇప్పట్లో రావడం పడదేమోనండి. అట్నించలా ఢిల్లీ వెళ్ళొచ్చు. పేపర్లో చూస్తారుగా. నా భోగట్టా తెలుస్తూనే ఉంటుంది."

"ఏమిటీ! మీరు పేపరుకూడా పెట్టిస్తున్నా రన్న మాట. భేష్" అన్నారు రామనాథంగారు.

రైలు ఓ మైలుదూరం వెళ్లాక, రామనాథంగారి మాటల్లో హేళన బోధపడింది సుబ్బారావుగారికి.

"హారి నీ! ... ఇందుకే నాకు మంట. చూస్తాగా, మీ జీతాలెలా పెరుగుతాయో" అన్నాడు కిటికీలోంచి బయటకు కసిగా చూస్తూ......

*   *   *

...దేశసేవ చేసితీరతానని సుబ్బారావుగారు ఎంత పట్టుపట్టినా కుదిరిందికాదు. కావలిస్తే దేశమధ్యంలోనే ఉండి కావల్సినంత సేవ చెయ్యండిగాని, ఇక్కణ్ణించి చెయ్య డానికి వీలుపడదని చెప్పారు అక్కడివారు. ఉన్న మినిస్టర్లకే ఇళ్లు దొరకక ఇబ్బందిపడుతున్నారోకాయన.

"ఆ, దాందేముందండి? మనం ఇక్కడ ఉంటామా పెడతామా? ఊహు...టూరుచేస్తూ ఉండడమేగా! ఊళ్లో ఉన్న రెండ్రోజులూ కావలిస్తే హోటేల్లో ఉంటాంలెండి" అని చూశారు సుబ్బారావుగారు.

"నీకు మరీ మతిపోతోంది నాన్నా. వాళ్లంతా వేళాకోళంచేస్తున్నారు. అదీగాక ఎలెక్షన్‌లో గెలిస్తేగాని మినిస్టరుగిరీ ఇవ్వరు" అంది సీత.

"అమ్మదూ, నీకు తెలీ దూరుకో" అని కోపడ్డాడు సుబ్బారావుగారు.

అలా ఎలెక్షనుకి నిలబడనివాళ్లని ఇదివరకు నామినేటెడ్ మినిష్టర్లుగా నిలబెట్టిన సందర్భాలూ, వివరాలూ ఆయన కంఠతా పట్టాడు. అవన్నీ కలసిరాకపోతే, చివరికి ఎలెక్షనుకే నిలబడతాను అన్నాడు.

'దర్జాగా నిలబడండి' అన్నారుగాని దగ్గర్లో ఎలెక్షన్‌లు ఏమీలేవాయె.

చివరికి విసుగెత్తి దేశసేవని ఐదేళ్లు వాయిదా వేసుకొని తిరుగుటపాలో ఇంటికొచ్చేశాడు సుబ్బారావుగారు సుతా సమేతుడై.

* * *

"పోనీ, కనీసం డిప్యూటీ దేశసేవ చేస్తాననకపోయారూ— ...ఆర్నెల్లుణ్ణిచ్చినా చాలనకపోయారూ" అన్నాడు రామనాథంగారు మర్నాడు ఉదయం సానుభూతి నభినయిస్తూ.

"ఆర్నెల్లుకాదు ఆరు ఘడియలుకూడా—" అంటూ హఠాత్తుగా ఆగిపోయాడు సుబ్బారావుగారు. మూడురోజుల నాడు తను దేశసేవకోసం హైదరాబాద్ వెళ్తున్నప్పుడు రామనాథంగారు హేళనచేశాడన్న విషయం చటుక్కుని జ్ఞాపకం, అందుకని కోపం, వచ్చాయి.

"ఇదుగో - ఏవండోయ్, మీ రేమనుకుంటున్నారో ఏమిటోగాని మా పిల్లదాన్ని మీ గురునాథానికి ఛస్తే ఇవ్వను, ఆఁ" అన్నాడు.

"మేం ఎప్పుడూ అడిగినట్టు గుర్తులేదే" అని తడుముకోకుండా జవాబు విసిరిన రామనాథంగారు క్షణాంతరవాత నాలిక్కరచుకున్నాడు - ఎంతపనైపోయిందీ అని. సుబ్బారావుగారి మనసులో ఇలాంటి సదభిప్రాయం ఉన్నట్లు ఆయన కలలోకూడా అనుకోలేదు. గురునాథరావు సీతవంక గుడ్లు తేలవేసి చూడ్డం గమనించిన సమయాలలోమటుకు ఆయనకి రెండుమూడుసార్లు ఆ ఊహతోచింది. సుబ్బారావుగారికి మనసులో అలాంటి సంకల్పం ఉందన్నమాట. ఇప్పుడాయన

కోపంలో ఇంత చక్కగా దాన్ని ప్రకటించాడు. "ఏం లాభం."

అప్పటికే, అవతల గదిలోంచి ఈ సంభాషణవింటున్న గురునాథరావు గుండె గుభేలు మంది. అని, ఓసారి ఆగింది. ఆ తరువాత పనిచెయ్యడమో, ఆగిపోవడమో తేల్చుకోలేక తటపటాయించింది.

'ఏల బ్రతుకేల' అనే విషాదగీతం పాడవచ్చునని యజమానికి సూచించింది. కాని గురునాథరావుకి అలాటి పిచ్చివేషాలు గిట్టవు. సీతకి నచ్చవని భయం.

అనుకోకుండా పెద్దలాడుకున్న సరసం కాస్తా ఇలా బెడిసికొట్టింది. ఆ దెబ్బ తిన్నది పిన్నలు.

సుబ్బారావుగారు తిక్కకోపంకొద్దీ గబగబా వాకబు చేసేసి, మునిసిపల్ చైర్మన్ అయితీరాలనుకుంటున్న ఒకానొక గణపతిరావుగారిని వరించి, వారి కుమారుడికి సీతనివ్వ నిశ్చయించారు. అంతకు ముందింకో ఇంజనీరు వినాయకరావుగార్ని చూసి ముచ్చటపడి సంబంధం ఖాయపరచబోయారు గాని, వారికి కుమారులు లేని వైనం ఆఖరుక్షణంలో తెలిసి విరమించారు.

తెలుగు సినిమాకథ చివరి భాగంలాగా, ఆయన ప్రయత్నాలూ, నిర్ణయాలూ, కార్యాలూ హడావుడిగా జరిగిపోయాయి. వారూ వీరూ చూచుకున్నారు. ముహూర్తాలూ పెట్టేసుకున్నారు.

ఇలాటివి గురునాథరావు ఖాతరు చెయ్యడుగాని, సీత పద్ధతి చూడడంతో అతనికి మతి పోయింది. చూడవచ్చిన పెళ్లికొడుకు లందరికీ వంకలుపెట్టి వచ్చినదారినే పంపించేస్తుం దనీ, ఈలోగా తను బియ్యే పాసై ఉద్యోగం సంపాదించి పెళ్ళికి సిద్ధంకావచ్చుననీ అతని ఆశ.

కాని సీత అలాటి పనేం చెయ్యలేదు. ఔను అనలేదు, కాదనలేదు.

అక్కడిలో గురునాథరావుకి సీత మీద ఆశ, జీవితం మీద ఆసక్తి తగ్గిపోయాయి. ఆశక్తుడి క్రోధం, దాని తరు వాయి వాయ అయిన దుఃఖం పెల్లుబికాయి...

... ఉత్తరక్షణాన ఊళ్లో పెద్దల తలకాయలమీద కనబడని రాళ్ళు వర్షించాయి. 'ఏమిటిది!' అని వాళ్ళు ఆశ్చర్యపడ్డారు గాని—

"ఓ ప్రేమకథా! నీదారి సదా అడ్డదిడ్డంగానే సాగిందిగదా. వెనకటికి లైలామజ్నూ, దరిమిలానో ఆ వెనుకో రోమియో జూలియట్, ఇపుడు సీతా నేనూ... నాన్నలూ, మామయ్యలూ, సంఘం దళసరిగోడలూ ప్రేమికు లని ఎంతో బాధ పెడుతున్నాయి గదా!" అంటూ గురు నాథరావు క్షుభితహృదయం విసరిన శాపనార్థాంతరవ్యాసాలే అలా రాళ్ళయి నెత్తిన పడుతున్నాయని వాళ్ళు పసిగట్ట లేకపోయారు. ఒక రిద్దరికి తెలిసినా, 'ఆ ముక్క పైకి అంటే లాయరు సుబ్బారావుగారికి కోపం వస్తుంది, బాగుండదని, నోరు మూసు కూరుకున్నారు.

అలా కోపంగా శాపనార్థాలు గుప్పించడం అయిపోయిన తరువాత గురునాథరావుకి దుఃఖం, ఈ లోకంలో తక్షణం తన జీవితం 'అభావం' అయిపోవాలన్న సంకల్పం మరింత ఎక్కువ అయ్యాయి. ఈ స్థితిలో ఒంటరిగా ఉండడం మంచిదికాదని తోచి, మర్నాడు ప్రొద్దుటే లేచి, తుకారాముణ్ణి వెతుక్కుంటూ బయల్దేరాడు. తుకారాం ఇప్పుడు రోడ్లవెంట తిరగటం లేదనీ, తుకారాం న్యూస్ సర్వీస్ ఆఫీస్‌లోనే కూర్చుంటున్నాడనీ తెలిసింది.

వెళ్లగానే ఔలిపతిరావు ఎదురయ్యాడు.

"హల్లో గుడ్‌మార్నింగ్, మీరు ఆత్మహత్య చేసుకోవాలనుకుంటున్నారు గదూ. రైటే! నాక్కూడా మార్గాంతరం తోచలేదు. కానివ్వండి. విషయాలకు మంచి హెడ్డింగుపెట్టి మెడ్రాసు పంపిస్తాను. "ప్రముఖ ప్రేమికుడి ప్రపంచాంతర ప్రయాణం' అని. అన్నాడు ఔలిపతిరావు.

గురునాథరావుకి చిరాకేసింది.

"నీ ఔలిపతీమండ" అని విసుక్కున్నాడు.

"మరేండి, నాపేరే ఔలిపతిరావు. ఆ వేళ రాత్రి వచ్చింది నే నేనండి...అరె, అలా కోపంగా చూస్తారేం? కొడతారా ఏమిటి కొంపతీసి" అంటూ అర్జెంటుగా ప్రక్కగదిలోకెళ్ళి తలుపేసుకున్నాడు ఔలిపతిరావు.

* * *

గురునాథరావు విచారంగా ఇంటికెళ్ళి తన డైరీతీసి సీతకథను చదువుకుంటూ కూర్చున్నాడు. క్రితంరోజు సాయంత్రం వరకూ జరిగిన సంఘటనలన్నీ చదివి ఆగాడు.

ఈ కథని ఎవరేనా సినిమాతీస్తే ఈ ఘట్టంలో హీరో చేత ఒకసారి నిట్టూర్పించి, డ్యూయెట్ మొదలెట్టింది. తొలి చరణం కాగానే, పక్కవాటాలో ఉండే హీరోయిన్ దగ్గరికి కెమెరాని పాన్ చేయిస్తారు. ఇక్కడొచ్చే చిక్కేమిటంటే సీతకి పాటరాదు. అయితే పాన్ చేసిన కెమెరాని కొంచెం అసింటా జరిపితే అక్కడ, మంత్రిపదవి లభించలేదని మథన పడుతున్న లాయరు సుబ్బారావుగారు దొరుకుతారు. ఆయనా మంత్రిగిరి తప్ప మరోటి గిట్టని ఏకలవ్యుడే కాబట్టి ఈ ఘట్టంలో ఈ ఏకలవ్యద్వయంమీద డ్యూయెట్ చిత్రించ వచ్చు. మంత్రిగిరికి సిద్ధపడ్డాడుగాబట్టి పాటవచ్చినా మాని శాపాడిందికి వెనకాడ డాయన.

'సరే' బరువుగా నిట్టూర్పుబోయాడు గురునాథం. కాని ఆ పనిని అరక్షణంలో ఇంకెవరో చేసిపెట్టారు.

"ఆశ్చర్యపడకు నేనేలే" అన్నాడు తుకారాం.

"దానికీ ఓపిక లేదు." అన్నాడు గురునాథరావు. వెనక్కి తిరిగి చూడకుండానే.

"మరేం ఫరవాలేదు. అదే వస్తుంది. సీతకి గణపతి రాయుడుగారి సంబంధం ఖరారైనందువల్ల; నీకా పిల్ల లభించడం కల్ల. గ్యారంటీ ఇస్తున్నాను... నేను తుకారాం న్యూస్ సర్వీస్ మానేసి తుకారాం గ్యారంటీ సర్వీసు పెట్టా నులే," అన్నాడు తుకారాం నవ్వుతూ.

మతిపోయి ఏడుస్తున్నవాడికి, శ్రుతిచూసి మరీ కానిమ్మని యతి ప్రాసాదియుతమైన వాక్యంలో సలహాలివ్వటం,

చూచేవాళ్ళకు సరదాగా ఉంటుందిగాని, ఆ స్థితిలో ఉన్న గురునాథరావుకు కాదు. అందుకని అతనికి కోపంవచ్చింది. జుట్టు పీకేసుకోబోయి, అంతపనీ చేశాడు. నెప్పెట్టింది. పైగా క్రాపింగు రేగిపోయింది.

"చూశావా తొందరపాటువలన కలుగు నష్టములు? ఇప్పుడు మళ్ళీ పాపిడితియ్యడం అరగంట పని," అన్నాడు తుకారం బిక్క మొహం పెట్టి, నవ్వడానికి ప్రయత్నిస్తూ.

"కాదు. ఐదునిముషాల పని," అని గురునాథరావు చివాలువలేచి చరచర సెలూనుకెళ్లి తిక్క కోపంలో గుండు చేయించుకొచ్చేశాడు.

రాంగానే రామనాథంగారు, ఆయన భార్యాకూడా మండిపడ్డారు గురునాథంగుండు చూసి. "మేం ఇద్దరం పోయామనుకున్నావా" అన్నారు.

గురునాథం దిగాలుపడిపోయాడు. ఆ పోవడం పోవడం అలాగే మంచిదారిన పడిపోయి దారుణమైన శ్రద్ధతో పుస్తకాలు చదివెయ్యడం మొదలెట్టాడు. కొద్ది రోజుల్లోనే క్లాసులో వెనకబెంచీల వాళ్ళంతా అతన్ని వెలేసి ముందరకి నెట్టేశారు. అందరూ అలా తరిమికొట్టేసరికి గురునాథం చివరికి ముందు బెంచీల మంచి విద్యార్థుల్లో కలిసిపోయి వాళ్ళని మించిపోయాడు. "ప్రతి టెస్టులోను అతనే ఫస్టు" అని అందరూ ముక్కున వేలేసుకు చెప్పుకోసాగారు.

"ఓడలు బండ్లవును" అని చెప్పుకు వాపోయారు వెనక బెంచీలవాళ్లు.

లెక్చరర్లంతా కలిసి, గ్రీవాలు కలవకపోయినా కాస్త అటూ ఇటూగా ముక్తకంఠంతోనే "బ్రిలియంట్ స్టూడెంట్" (అనగా ప్రకాశించే విద్యార్థి) అనేశారు పుసుక్కున.

ఇంకేముంది, అక్కడితో గురునాధరావు, ఉహూం, ప్రకాశించిపోవడం మొదలెట్టాడు. అతని గురించి కట్టుకథలు ప్రచారంలోకొచ్చాయి.

"...వాళ్లింట్లో రాత్రిళ్లు దీపాలు వెలిగించడం మానేశారట తెలుసా...అతను చీకట్లో పుస్తకం చదివెయ్యగలడట మామూలుగా...మరి ఆ ముఖద్యుతి అంతా అందుమీదే పడుతుందిగదా..." అని చెప్పుకొన్నారు కథలు కొందరు.

తుకారాం ఒక కథ అల్లేశాడు. "ఒకరోజు రాత్రి ఓ కుర్రాడు లైటు లేకుండా సైకిలు తొక్కడం పోలీసు చూశాడు. వాణ్ణి ఆపి అడిగేలోగా ఆ వీధి అంతా కళ్లు మిరుమిట్లు గొలిపే కాంతితో నిండిపోయింది. పోలీసువాడు ఇది పగలు కాబోలు అనుకుని, నాలిక్కరచుకొని వెళ్ళిపోయాడు. కాని అంతలోకే మళ్ళీ చీకట్లు కమ్మాయి. కారణం?

గురునాధరావు ఆ రాత్రి ఇంటికెళ్తూ ఆ వీధిలోంచి ఓ సందులోకి మళ్లెను. ఆ కాస్సేపూ అతని కాంతితో ఆ రాత్రి పట్టపగలన్న భ్రమ కలిగించెను......

* * *

ఇలా విపరీతమైన ఉపాఖ్యానాలతో గురునాధరావు ప్రఖ్యాతి విస్తరించింది. అక్కడినించి ఆడపిల్లల్ని కను

మన్న తలితండ్రులు తమపిల్లనంటే తమ పిల్లని చేసుకో మంటూ గురునాథం తండ్రిని బ్రతిమాల సాగారు. కట్నాలు ఎంతైనా ఇస్తామన్నారు.

కాని గురునాథరావు ఏ ఒక్క పిల్లనీ కన్నెత్తిచూడ లేదు. పన్నెత్తి పలకరించ లేదు. అక్కడితో అతని గిరాకి మరింత పెరిగింది. అంతా ఆశ్చర్యపడిపోయారు. ఎంత ప్రేమేనా మరీ ఇంత ప్రేమా అని విస్తుపోయారు గురునాథ రావు 'ఏకలవ్య' డని తెలిసినవాళ్లు.

తుకారాం ఓరోజు పొద్దున్నే గ్యారంటీ సర్వీసులో 'పెళ్ళిళ్ళ బ్యూరో' శాఖ పెట్టా నన్నాడు. అని, పదిమంది ఫోటోలు పట్టుకొచ్చేసి చూపించాడు.

"అబ్బీ! ఈ పిల్లని చూడు. ఇంజనీరు. ఆస్తి: పదెకరాలు. మేడ, కారు. ఈ బొమ్మ చూడు: గవర్న మెంటు సర్జను. రెండు కార్లు. పోనీ ఇది చూడు. పెద్ద బిజినెస్ మాను. ఏకబిగిని పదిమంది ఆడపిల్లలికి పెళ్ళిచేసే ఆస్తీ, 2కార్లూ, రెండే కూతుళ్ళూ ఉన్నాయి. ఇది రెండోది."

గురునాథం విసుక్కున్నాడు. "ఇంజనీరుల్నీ, డాక్టర్లనీ నే నెక్కడ చేసుకోనురా, బియ్యేకూడా కాను. అయినా కాపోయినా సీతని తప్ప ఇంకోళ్లని చేసుకోను" అన్నాడు.

తుకారాం జాలిపడ్డాడు. "ఇంజనీరూ, డాక్టరూ చేస్తున్నది అమ్మాయిలు కాదు. వాళ్ళనాన్నలు. వాళ్ళ ప్రభవైనర చెబుతున్నా, అదేముఖ్యం అనుకున్నా ఒక్కొక్కడూ ఓడజనేసి అల్లుళ్ళకి జోడొందల ఉద్యోగాలిప్పించగలడు. ఇదిగో

ఈ చివరి బిజినేస్ ఆయన్ని, అదే, ఆయన కూతుర్ని చేసుకుంటే, ఇంకో లాభం ఉంది. లావుపాటి బావమరిది దొరుకుతాడు. ఎవర్నైనా తన్ని రమ్మంటే ఇట్టే చితగ్గొట్టి చక్కా వస్తాడు.''

''గెటౌట్'' ఖన్నాడు గురునాథం.

''దానికేం మాభాగ్యంకాని, ఈ బొమ్మలు గల పన్నెండుమంది పెద్దలికీకూడా మా తుకారాంగ్యారంటీ సర్వీసువారు గ్యారంటీలు రాసిచ్చేశారుగదా- తప్పక నిన్నొప్పించ గలమని. ఇందులో ఏ ఒక్కర్ని నువ్వు కాదన్నాసరే, మా ఆఫీసుకి పేరుపోతుంది.''

''ఘెఠాఠ్'' అన్నాడు గురునాథం ఉక్రోషంతో.

''అయితే, నీ ఈ విషాదగాథ ఎన్నాళ్ళు సాగేట్టు,'' అన్నాడు తుకారాం చిన్నబుచ్చుకుని.

గురునాథరావు కోపం దిగమింగి కష్టంమీద చిరునవ్వు ప్రచురించాడు. ''శిష్యా, ఇది అనంతం.''

''నాన్సెన్స్! వల్లకాదు. నీ కథకి చప్పున ఫులిస్టాపు పెట్టించేసి, అది కాస్తా రాసేసి, దాంతో తుకారాం స్టోరీ సిండికేటు ప్రారంభిస్తాం, కాసుకో''-చక్కాపోయాడు తుకారాం.

* * *

గురునాథరావుతండ్రి రామనాథం గారికి ఒళ్ళుమండి పోయింది కొడుకు వరసచూసి. 'ఏదో ఓ సంబంధం ఖాయపరిచితీరాల్సిందే' అన్నాడు కారాలు నూరుతూ.

గురునాథరావు అప్పటికి పిల్లిఅయిపోయి తనగదిలో కెళ్లి, తల్లిద్వారా తండ్రికి మెల్లిగా తన ఊహ చెప్పించాడు.

"కల్ల" అన్నారు రామనాథం గారు గంభీరంగా కిటికీ అవతలికి చూస్తూ.

"అదే బావుందండీ! ఇదేం సినిమా అనుకున్నారు టండీ అలా ఒక్క ముక్కలో తేల్చేసి అటో చూస్తారు? నూరేళ్ల బతుకు, కుర్రవెధవ భయపడుతున్నాడు! పిల్చి కనుక్కోండి సరిగ్గా" అందావిడ.

పిల్చి కనుక్కున్నాడు రామనాథంగారు.

సిగ్గుపడుతూ 'ఔను!' అన్నాడు గురున్నాథం.

"మరి సీతకి ఇష్టమేనా? అన్నాడు తండ్రి.

గురునాథం చాలాసేపు జవాబు యివ్వలేదు. ఆనక తల్లివంక చూసి, తల వంచుకుని, 'తెలీదు' అన్నాడు మెల్లిగా.

రామనాథంగారు పగలబడి నవ్వారు. "ఏమి ప్రమోజకుడివిరా నా తండ్రీ" అంటూ.

"నా వెర్రినాన్నా, ఎలా బ్రితుకుతావురా నోట నాలుక లేనివాడివి!" అని, ఊహు, ఇదైపోయింది వాళ్ళమ్మ.

"అదే, ఆ సీతే తగును వీడికి. ఇన్నాళ్ళు ఆ తిక్కముండా తండ్రిని పెంచుకొస్తోందిగదా ఇంక ఈ వెర్రిబాగుల మొగుణ్ని కూడా సాకుతుంది. ఆ సుబ్బారావుగారు ఏమంటాడో చూడాలి మరి."

"సీత కిష్టమేలెండి ఒకటి రెండుసార్లు కదలేసి చూశాను" అందాయన భార్య.

గురునాథం బుర్ర గిర్రున తిరిగిపోయింది. సిగ్గుపడుతూ గదిలోకి పరుగెత్తి "హాయిగా - హా" అనే పాట పాడబోయి వరస కుదరక మానేశాడు.

"జడ్డి వెధవ" అన్నాడు రామనాథంగారు నవ్వుకుంటూ.

*   *   *

ఆయన బళ్ళోకెళ్ళబోతూ ఉండగా తుకారాం, రివ్వున పరిగెత్తుకొచ్చాడు.

"నమస్కారం అండి. నా పేరు తుకారాం, నేను గురువులు ఫ్రెండుని" అన్నాడు వినయంగా.

"గురువు లెవరోయ్" అన్నాడు రామనాథంగారు చిరాగ్గా.

"అదే మీ అబ్బాయండి. ఐమీన్ గురునాథం"

"ఏమిటో మీనూ మానూను. ఏం చదువుకున్నావు నువ్వు ఒక్క వాక్యం సరిగ్గా మాట్లాడలేక పోతున్నావు. ఏం సంగతి" అన్నాడు రామనాథంగారు.

"మీరు కొంచెం గణపతిరావుగారింటికి రావాలండి. అక్కడ మీ సుబ్బారావుగారూ, గణపతిగారూ పోట్లాడుకుంటున్నారు. మిమ్మల్ని కే కేసుకు రమ్మన్నారండి...! అసలేమిటంటే___"

రామనాథంగారు సరాసరి గణపతిగారింటికి చరచర వెళ్ళాడు. తుకారాం వెనకాలే వెళ్ళాడు.

"ఊఁ, ఏమిటి దెబ్బలాట" అన్నారు రామనాథంగారు దారిలో.

"మరి నరసన్నగారొచ్చారు గదండీ మద్రాసునుంచి"

"ఆయనెవరు?"

"ఆయనా? డోళ్ళ వర్తకు డనుకుంటానండి"

"ఏమిటి? డోళ్లా?"

"మరేండి, డోళ్ళు. పెళ్ళికి వాయిస్తారూ, అవీ. ఆయన అస్తమానం డోళ్ళు చీల్చి డోలుకడతా నంటాడుగా. అలా చేస్తాడు ఆయనే. మరి అలా కట్టిన డోళ్ళు అమ్ముకుంటా డని నా అభిప్రాయం."

"నీ అభిప్రాయా లొదిలేసి సంగతి చెప్పవోయ్" అన్నారు రామనాథంగారు.

"అదేమిటండీ. నాకూ రాజకీయాలు తెలుసు. నేనూ పొలిటికల్ వాణ్ణే"

"అందుకే...సర్లే, తరువాత?"

తరువాతే కథ అడ్డం తిరిగింది. నరసన్నగారొచ్చే వరకూ గణపతిరావుగారూ, సుబ్బారావుగారూ ఇల సాటిలేని నేస్తాల్లా మునిసిపల్ ఎలెక్షనుకు సన్నాహాలు చేస్తున్నారు. చైర్మనుగిరీకి పోటీచేస్తున్న రెండో ఆసామి కట్టుదిట్టంగా 'ధనర్థారి'యై ఎన్నికల సమరరంగంలో దిగాడని తెలిసి గణపతిరావుగారు కాస్త బెదిరారు. ఎందుకేనా మంచిదని మద్రాసునుంచి నరసన్నగారిని పిలిపించారు. ఆయన ఎసెంబ్లీకి పోటీచేసి ఓడిన వ్యక్తి. గెలిచిఉంటే మినిష్టరై

పోయేవాడు. అందుకని ఆయన చెబితే జనం వింటారని గణపతిగారు ఆశపడి రమ్మన్నారు.

తీరా నరసన్నగారొచ్చాక ఆయనతో సుబ్బారావుగారికి జోస్తీ ఎక్కువైపోయింది.

ఆ నరసన్నగారు అవబోయిన మినిష్టరు, తనేమో అవబోయే మినిష్టరు. ఎలాగేనా ఇద్దరూ ఒక ఫాయావాళ్లవుతారు. ఆ ముక్క నరసన్నగారే అన్నాడు.

సుబ్బారావుగారు పొంగిపోయారు.

ఈ 'మినిష్టర్ల' సరసాలకి గణపతిరావు తట్టుకోలేక పోతున్నాడు.

బియ్యేపరీక్ష తప్పినవాడి దృష్టిలో స్కూలుఫైనలు పరీక్ష లంతలోకువగా కనబడింది, నరసన్నగారికీ మునిసిపల్ ఎలక్షను.

"ఇదీ ఓ ఎన్నికేనా. ఈపాటిదానికి సాయాలూ ప్రచారాలు ఎందుకూ? నేనో చిన్న చీటీరాస్తాను, దాన్ని అచ్చుకొట్టించి పంచిపెట్టిస్తేచాలు" అన్నాడాయన.

"మరే, ఇంతోటి ఎలక్షనుకీ అంతకన్న ఖర్చు దండుగ" అన్నాడు సుబ్బారావుగారు హుషారుగా.

గణపతిగారికి ఒళ్లు మండిపోయింది. "ఏమిటండీ మీ హేళన, ఒక్కలా నిన్నటినుంచి మిడిసిపడిపోతున్నారు. చావ ఉంటే గెలవండి చూద్దాం. లోకువగా మాటాడినట్టు కాదు" అన్నాడు విసురుగా.

సుబ్బారావుగారు తెల్లబోయి నిర్జీవంగా నవ్వుతూ నరసన్నగారివంక చూశాడు.

ఆయన పేపరులో దాక్కొని తెగ చదివేస్తున్నాడు.

"ఆయనవంక చూస్తా రెందుకు? ఆయనా ఓ రాయి విసుర్తాడనా? విసిర్నా ఆయనకైతే చెల్లింది. చెల్లినా అలావిసరడు. ఆయన మిత్రుడు; మీరు కాబోయిన బంధువులు. అదే తేడా" అన్నాడు గణపతిగారు.

కథ ఈ ఘట్టంలో ఉండగా చూడవచ్చిన తుకారం అదనుచూచి "సుబ్బారావుగారు దేవుడంటివ మనిషండి, ఆయన్ని నిష్కారణంగా మాటలనకండి" అనేసి పరుగెత్తుకు చక్కాపోయాడు రామనాథంగారిని కేకేసుకురావడానికి.

* * *

రామనాథంగారు సావిట్లో అడుగు పెట్టేసరికి "ఇలాంటి వాడికి నేను చచ్చినా నా పిల్లనివ్వను" అంటున్నారు సుబ్బారావుగారు.

"మీరిస్తే చేసుకునేవాడెవడు? మా పిల్లాడికి సవాలక్ష సంబంధా లొస్తున్నాయి" అంటున్నారు గణపతిరావుగారు.

నరసన్నగారు నవ్వుతూ చుట్టతీసి అగ్గిపెట్టెకోసం వెతుక్కుంటున్నారు.

తుకారం చటుక్కున గుమ్మందాటి పూలమొక్కల దగ్గరున్న పచ్చగడ్డిపరకలు నాలుగు తెచ్చి గణపతిరావుగారికీ, సుబ్బారావుగారికీ మధ్యన పడవేశాడు.

అది భగ్నమంది.

నరసన్నగారు గబుక్కున లేచి, ఆ మంటలో చుట్ట ముట్టించి పొగ పీల్చారు తృప్తిగా.

"అదేపాయె లెండి సుబ్బారావుగారు. మా గణపతిగా రబ్బాయికి పిల్లని మీా రివ్వకపోతే నే నిస్తాను. ఏమంటారు బావగారూ?" అన్నాడు వెటకారంగా నవ్వుతూ.

"శుభం" అన్నారు గణపతిగారు.

"బావగారూ, ఇంక మనం ఇంటికెళదాం రండి. ఇక్కడేంపని" అని సుబ్బారావుగారి భుజంమీద చెయ్యేసి ఇవతలికి తీసుకొచ్చారు. అంతవరకూ మాట్లాడకుండా నిల్చున్న రామనాథంగారు.

"సుబ్బారావుగారూ, మీరు అర్జెంటుగా మీా సీతమ్మకి పెళ్లిచేసేస్తే మీా మాజీబావగారికి చెప్పుదెబ్బకొట్టినట్టవుతుందండి" అన్నాడు తుకారాం.

రామనాథంగారు ప్ఁ అన్నారు. కోపం రెచ్చగొట్టే ఆ మైకంలో ఉండగా వాగ్దానాలు పుచ్చుకోడం ఆయనకి సుతరామూ ఇష్టం లేకపోయింది.

నిశ్శబ్దంగా ఇంటికెళ్ళారు.

అక్కడ కూచుని సుబ్బారావుగారు మంచినీళ్లు తాగి తేరుకున్నాక కర్తవ్యం ఏమిటన్నారు విచారంగా.

"కర్తవ్యం మీా వంటివారికి నేనా చెప్పేది?"

తాపీగా ఆలోచించండి అన్నాడు రామనాథంగారు లాలనగా.

సుబ్బారావు ప్రసన్నుడయ్యాడు. "అహ—అసలు చెబుదురూ" అన్నాడు.

రామనాథంగారు చిన్న పొడిదగ్గుదగ్గి ఉపక్రమించారు.

"మంత్రికాబోయేముందు మంచిపని చెయ్యాలన్నారు. మా అబ్బాయి మీ పిల్లని చేసుకుంటానని పట్టుబట్టి ఇంకెన్ని సంబంధాలొచ్చినా తిరగ్గొడుతున్నాడు. మీ సీతమ్మకీ ఇష్టమేట. ఇక మామాట అంటారా—చెప్పేదేముంది? మీ వంటివారితో వియ్యం...మరి మీరు శాంక్షను చెయ్యడమే తరువాయి" అన్నారు తాపీగా.

సుబ్బారావుగారు చుట్టూ పరకాయించి చూశారు. గదిగుమ్మానికి చేరబడి రామనాథంగారి భార్య నించుంది.

"అవు నన్నగారు—ఊఁ అనండి" అందామె.

సీత వెనకాల నిల్చుంది—తనవేపే చూస్తూ. కొంచెం అసింటా తుకారాం నిలబడి ఆతృతగా చూస్తున్నాడు.

సుబ్బారావుగారు గంభీరంగా మొహంపెట్టి ఆలోచించారు. చుట్టూ పరకాయించారు.

"అప్లికేంటు ఏడీ" అన్నారు.

"అబ్బాయ్, ఇలా రా" అని రామనాథంగారు కేకేశారు.

గురునాథం వచ్చాడు మెల్లిగా.

"ఏవోఁయ్, మా పిల్లని చేస్కోవాలనుకుంటున్నావా?" అన్నారు సుబ్బారావుగారు.

'మరేనండి' అన్నాడు గుర్నాథం మెల్లగా.

"ఏమే సీతా—నచ్చాడా?"

సీత నవ్వింది; ప్రేమించినవాడిని పెళ్ళాడబోయే పిల్లలా.

"శుభం. శాంక్షనైపోయింది. పెళ్లిముహూర్తం పెట్టించండి బావగారూ" అన్నారు సుబ్బారావుగారు.

అందరి మొహాలూ వికసించాయి ఆనందంతో.

హీరో గుర్నాథరావు ముఖారవిందంమాత్రం కాస్త తటపటాయిస్తోంది.

ఏమిటా? అన్నారు రామనాథంగారు.

గు ... గుండు ... కొ ... కొంచెం ఆగి ము ... ముహూర్తం—అన్నాడు గుర్నాథం గుటకలు మింగుతూ.

"హారి నీ ... గుండుగురించికూడా బెంగే? ... వెధవ క్రాఫింగు—ఇట్టే పెరుగుతుంది — భయపడకు. మీనాన్న జీతం అనుకున్నావేమిటి, ఒకంతటా పెరక్కపోడానికి!" అన్నారు సుబ్బారావుగారు ఫెళఫెళా నవ్వుతూ.

"—లేక పోతే నీ మావగారి అదృష్టం అనుకున్నావా?" అని రామనాథంగారు అందుకోబోయారు గాని, కో లేదు. తమాయించుకున్నారు.

*　　*　　*

పెళ్లిమర్నాడు రాత్రి గురునాథరావు సీతకి తన డైరీ వినిపించి తనునడ్డ వేదనని వివరించాడు.

"సీతా, నీకోసం ఎన్ని సంబంధా లొదిలేశానో చూశావా? మీ నాన్నగారు మంత్రిపదవికోసం ఉద్యోగాలూ ప్రాక్టీసూ వదిలేసినట్టు.? ఎటొచ్చీ నేను సాధించాను. ఆయన ఇంకా లేదు. సాధిసా రనుకో."

"ఈ ముక్క నా దగ్గరంటే అన్నారుగానీ మా నాన్న దగ్గరంటే జాగ్రత్త. ఆయన సుబ్బరంగా ప్రాక్టీసు చేద్దామని నిశ్చయించుకున్నారు." అంది సీత నవ్వుతూ.

* * *

'పది' — అంది గదిలో గడియారం.

'మరేస్మి' అంది సుబ్బారావుగా రింటి గడియారం ప్రతిధ్వని.

—